

టన్ను రూ.1.05 లక్షల వరకు పలుకుతున్న వైనం





దానిమ్మలమైన ధర

దానిమ్మ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రైతుల మొహాల్లో సంతోషం కనబడుతోంది. నెలరోజుల కిందట నుంచి టన్ను దానిమ్మ ధర రూ.50వేల నుంచి 60వేల మధ్యలో ఉండేది. కానీ రెండు రోజుల కిందట రూ.70వేల నుంచి రూ.1.05లక్షల వరకు చేరింది. మండలంలో దానిమ్మ పంట సుమారు 1000ఎకరాల్లో సాగు చేశారు. గతేడాది టన్ను రూ.1.20లక్షల వరకు పలికింది. ప్రస్తుత కూడా ధరలు గతేడాది ధరలకు దగ్గరగా ఉండటంతో బెంగళూరు, తమిళనాడుకు చెందిన వ్యాపారులు దళారుల ద్వారా కొనుగోలు చేసి, మార్కెట్‌కు తరలిస్తున్నారు. వీటిలో కాయ నాణ్యతను బట్టి వ్యాపారులు తోటల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే తిమ్మంపల్లి, వేములపల్లి, కూచివారిపల్లి, కల్లూరు గ్రామాల్లో తక్కువరేటుకే విక్రయాలు జరిగాయి. వర్షాలు తక్కువగా రావడంతో పంట దిగుబడి ఆశించినస్థాయిలో ఉంటుందని భావించిన దానిమ్మరైతులకు వైరస్ పెద్ద దెబ్బవేసింది. వైరస్ సోకి కాయల దిగుబడి తగ్గిపోయింది. అయితే ధరలు పెరుగుతుండటంతో వచ్చిన దిగుబడితోనైనా అప్పుల్లో కూరుకుపోకుండా గట్టెక్కుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. - యల్లనూరు



ఏపుగా కాసిన దానిమ్మకాయలు

విద్యార్థులకు అస్వస్థత



హాస్పిటల్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

యాడికి, జనవరి 24: మండల పరిధిలోని కమలపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం తిన్నతరువాత విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శరీరంపై దద్దుర్లు వచ్చి దురద వేయడంతో సుమారు 20 మంది విద్యార్థులను యాడికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వంకాయ కూర, పలావు అన్నం వడ్డించారు. తిన్న కాసేపటి తరువాత విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు ఆటోలో తమ పిల్లలను ఆస్పత్రికి తరలించారు. ఉపాధ్యాయులెవ్వరూ ఆస్పత్రి వద్దకు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈఓలు కాశప్ప, ధనలక్ష్మి ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నీటి కాలుష్యం లేదా దుమ్ము, ధూళి వల్ల ఇలా జరిగి ఉంటుందని, ఫుడ్ పాయిజన్ కాదని వైద్యులు అంటున్నారు. విద్యార్థులకు అపాయం లేదని తెలిపారు. పాఠశాలకు వెళ్లి విచారిస్తామని ఎంఈఓ కాశప్ప తెలిపారు. అవసరమైతే పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించి, విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయిస్తామని అన్నారు.



వివరాలు ఆరాతీస్తున్న ఎంఈఓ కాశప్ప

27న టీడీపీ అధినేత చంద్రబాబు రాక సభను విజయవంతం చేయాలని కాలవ, పయ్యావుల పిలుపు



టీడీపీ జిల్లా కార్యాలయంలో సమావేశమైన నాయకులు

ఉరవకొండలో రా.. కదలిరా

అనంతపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఈ నెల 27న ఉరవకొండలో 'రా.. కదలిరా' బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ముఖ్య నేతలు సమావేశయమ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. జిల్లాలో ఇదివరకూ ఎన్నడూ జరగని విధంగా బహిరంగ సభను భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయించారు. జన సమీకరణ బాధ్యతలను కీలక నాయకులకు అప్పగించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, పార్టీ పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాజశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, గుర్రప్పనాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్, ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, రామ్మోహన్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శులు వెంకటశివుడు యాదవ్, తలారి ఆదినారాయణ, జేఎల్ మురళీధర్, బుగ్గయ్య చౌదరి, విశాలాక్షి, దేవళ్ల మురళి, స్వామిదాస్, మీడియా కో-ఆర్డినేటర్ కూచి హరి, బంగి నాగ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనను ఎండగట్టేందుకే: కాలవ

ఉరవకొండలో నిర్వహించే 'రా కదలిరా బహిరంగ సభకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరవుతారు. మహానాడులో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తారు. వైసీపీ అరాచక పాలనను ఎండగట్టడమే 'రా... కదలిరా' బహిరంగ సభ లక్ష్యం. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగింది. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేనను గెలిపించి చంద్రన్న పాలనను తీసుకువచ్చేందుకు పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి.

చరిత్రలో నిలిచిపోవాలి: కేశవ్

ఉరవకొండలో 'రా.. కదలిరా' బహిరంగ సభను చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయేలా నిర్వహిస్తాం. జిల్లాలోని పార్టీ నేతలు, శ్రేణులు సమష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ముందుకు సాగుతున్నాం. చంద్రబాబు సభకు పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలి.

గణతంత్ర వేడుకలు ఘనంగా జరగాలి

అధికారులకు జేసీ కేతన్ గార్గ్ ఆదేశం



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై ఆదేశాలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం టౌన్, జనవరి 24: గణతంత్ర దినోత్సవాలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. వేడుకలలో పాల్గొనే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేయాలని, తాగునీరు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరికి అప్పగించిన బాధ్యతలను వారు సక్రమంగా నిర్వహించాలని, వేడుకలు ఘనంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వర్లు, తహసీల్దారు బాలకిషన్, జిల్లా టూరిజం శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, నగరపాలిక డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

కృష్ణమూర్తి మాస్టారు కన్నుమూత



గుత్తి, జనవరి 24: పట్టణంలోని మాల్డస్ స్మిత్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా సేవలు అందించిన విశ్రాంత మాస్టారు కృష్ణమూర్తి బుధవారం కన్నుమూశారు. 2000 జూన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఆయన.. గుత్తి పట్టణంలోనే నివసిస్తున్నారు. తన స్వగృహంలో బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఆయన వయోభారంతో తుదిశ్వాస విడిచారు. చేతిలో బెత్తం ఉన్నా.. ఏ ఒక్క విద్యార్థినీ కొట్టని మాస్టారుగా, సౌమ్యుడిగా ఆయనకు పేరుంది. ఆయన మృతి పట్ల పూర్వ విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

ఎమ్మెల్యే అనుచరుడు

భూమిని ఆక్రమించాడు

కలెక్టరేట్ వద్ద బాధితుల బైఠాయింపు

అనంతపురం టౌన్, జనవరి 24: ఎమ్మెల్యే అనుచరుడు తమ భూమిని ఆక్రమించాడని, తమకు న్యాయం చేయాలని కోరుతూ ఓ వృద్ధురాలు తన కొడుకుతో కలిసి కలెక్టరేట్ వద్ద బుధవారం బైఠాయించారు. బాధితులు తెలిపిన మేరకు, శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన భానూబీ భర్త ఖాశీంకు సర్వే నంబర్ 173లో 12.47 ఎకరాల భూమి ఉంది. వీరికి ఇద్దరు కుమారులు, ఇత్తరు కూతుళ్లు ఉన్నారు. ఖాశీం చనిపోయిన తర్వాత కూతుళ్లు వివాహం చేసుకుని వెళ్లిపోయారు. కుమారులు అనంతపురం నగరంలో చేరారు. పొలాన్ని వడ్డే వేణు అనే వ్యక్తికి గుత్తకు ఇచ్చామని అంటున్నారు. ఎమ్మెల్యే అనుచరుడైన వేణు, తమ భూమిని ఆయన పేరిట, ఆయన బంధువుల పేరిట మార్పించుకున్నాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. కలెక్టరు నాగలక్ష్మిని గతంలో కలిసి ఫిర్యాదు చేశామని భానూబీ కుమారుడు దస్తగిరి తెలిపారు. శింగనమల ఎమ్మెల్యే భర్త సాంబశివారెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరామని, తమ ఓట్లు అనంతపురంలో ఉన్నందున ఎమ్మెల్యే అనంతను కలవాలని సూచించారని అన్నారు. తమకు న్యాయం జరిగేదాకా కలెక్టరేట్ వద్ద రోజూ ఆందోళన చేస్తామని అన్నారు.



కలెక్టరేట్ గేటు వద్ద భానూబీ, ఆమె కొడుకు దస్తగిరి బైఠాయింపు


సేమ్ టు షేమ్..!

మృతులు, స్థానికంగా లేనివారి పేర్లు అలాగే..

ఓటరు జాబితా చూశాక విపక్షాల్లో ఆందోళన

తుది జాబితాలో డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు


గుంతకల్లు, జనవరి 24: ఓటర్ల తుది జాబితా కూడా తప్పుల తడకగానే విడుదలైంది. ముసాయిదాలో వచ్చిన డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు, స్థానికంగా లేనివారి పేర్లు తుది జాబితాలో యథాతథంగా వచ్చాయి. ఓటరు జాబితాపై రాష్ట్ర వ్యాప్తంగా వెల్లువెత్తిన ఫిర్యాదుల నేపథ్యంలో తుది జాబితాను మెరుగుపరిచేందుకు ఎన్నికల కమిషన్ చాలా కసరత్తు చేసింది. ఈ కారణంగా ఈ నెల 5న విడుదల కావాల్సిన తుది జాబితాను 22న విడుదల చేసింది. కొన్ని డబుల్ ఎంట్రీలను డిలీట్ చేసినా, ఇంకొన్ని అలాగే ఉండిపోయాయి. స్థానికంగా లేనివారి పేర్లను కూడా అలాగే ఉంచేశారు. తుది జాబితా కోసం నెలన్నర గడువు తీసుకునే బదులు.. మధ్యలో మరో ముసాయిదాను విడుదల చేసి ఉంటే తుదిజాబితా మెరుగ్గా ఉండేదన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.



ట్రిపుల్ ఎంట్రీ.. హుసేన్

విపక్షాలలో ఆందోళన

మూడు రోజుల క్రితం విడుదలైన ఓటరు తుది జాబితాను చూశాక విపక్షాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. కలెక్టరు కార్యాలయం నుంచి ఓటరు జాబితాలు సోమవారం పార్టీల జిల్లా కార్యాలయాలకు వచ్చాయి. నియోజకవర్గ ఇన్‌చార్జిల చేతికి మంగళవారం చేరాయి. వీటిని బుధవారం పరిశీలించి.. డబుల్, ట్రిపుల్ ఎంట్రీలు అలాగే ఉండటం చూసి తలలు పట్టుకుంటున్నారు. కొన్ని పేజీలలోనే భారీగా డబుల్ ఎంట్రీలు కనిపించాయని, పూర్తిగా పరిశీలిస్తే మరెన్ని ఉంటాయోనని వాపోతున్నారు. బూత్ కన్వీనర్లను పార్టీ కార్యాలయాలకు పిలిపించి.. ఓటరు జాబితాను పరిశీలించే పనిలో పడ్డారు.



14వ వార్డులో ఆదిలక్ష్మి పేరిట డబుల్ ఓటు

మచ్చుకు కొన్ని..

గుంతకల్లు ఐదో వార్డులో బోయ హుసేన్ పేరు మూడు పర్యాయాలు వచ్చింది. సీరియల్ నంబర్లు 730, 746, 747లో హుసేన్ పేరే ఉంది. 14వ వార్డులో వేమూరు ఆదిలక్ష్మి అనే మహిళ పేరు రెండు చోట్ల ఉంది. ఎగ్గుల ఓబులమ్మ, ఎగ్గుల నాగేంద్ర, హనుమన్న అనే ఓటర్లు చనిపోయినా.. జాబితాలో అలాగే ఉంచారు. సాకే నాగరాజు అనే వ్యక్తి స్థానికంగా లేకపోయినా పేరు తొలగించలేదు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల ఎంపీటీసీ పామన్న పేరు గుంతకల్లు ఏడో వార్డులో ఉంది. వైసీపీకి చెందిన ఇతని పేరు తొలగించాలని ఫిర్యాదు చేసినా.. అలాగే ఉంచారు.

మాటల మంట!

జలవనరుల శాఖలో ఇంజనీరు వ్యాఖ్యలపై రేగిన దుమారం

కులం పేరుతో తిట్టారని 'జగనన్నకు చెబుదాం'లో అర్జీ

త్రీటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఆలస్యంగా స్పందన

నివేదిక ఇవ్వాలని ఈఈకి ఉన్నతాధికారుల ఆదేశం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: ఓ దళిత ఇంజనీరుపై డీఈ చేసిన వ్యాఖ్యలు జలవనరుల శాఖలో దుమారం రేపుతున్నాయి. హెచ్చెల్సీ సర్కిల్‌లోని హెచ్చెల్సీ డివిజన్‌లో డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ రామచంద్రమూర్తి మధ్య సోమవారం వాగ్వాదం జరిగింది. అనంతపురంలోని హెచ్చెల్సీ డివిజన్ ఈఈ కార్యాలయంలో డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ రామచంద్రమూర్తి మధ్య వృత్తిపరమైన క్షేత్రస్థాయి పరిశీలన, టీఏ, డీఏలకు సంబంధించిన అంశం చర్చకు వచ్చింది. ఈక్రమంలో పీఏబీఆర్ సబ్‌డివిజన్ కార్యాలయం కూడేరులో ఉండాలి. అనంతపురంలోనే ఉంటూ లబ్ధి పొందుతున్నారంటూ ఏఈ రామచంద్రమూర్తి.. డీఈ విశ్వనాథ్‌రెడ్డిని నిలదీశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈ.. సబ్ డివిజన్ కార్యాలయం ఎక్కడుంటే నీకెందుకు... ఇక్కడ నుంచే విధులు నిర్వహిస్తామంటూ ఏఈపై మండిపడ్డారు. మాటల మధ్యలో కులం ప్రస్తావన రావడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం తీవ్రమైంది. హెచ్చెల్సీ డివిజన్ ఈఈ శ్రీనివాసులు సమక్షంలో ఈ ఘటన ఈనెల 22న జరిగింది. దీనిపై ఆదేరోజు ఏఈ రామచంద్రమూర్తి త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అటు నుంచి స్పందన రాకపోడంతో డీఎస్పీని కలిసేందుకు యత్నించారు. సీఎం పర్యటన నేపథ్యంలో డీఎస్పీ బిజీగా ఉన్నారని చెప్పడంతో వెనుదిరిగారు. ఈనెల 23న ఉరవకొండ పర్యటనకు వచ్చిన సీఎం జగన్ దృష్టికి ఈ వివాదాన్ని తీసుకెళ్లేందుకు ఏఈ రామచంద్రమూర్తి జగనన్నకు చెబుదాం స్పందనలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన త్రీటౌన్ పోలీసులు బుధవారం హెచ్చెల్సీ డివిజన్ ఈఈ శ్రీనివాసులను కలిసి ఘటనపై ఆరాతీశారు. జరిగిన ఘటనపై నివేదిక ఇవ్వాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు అందజేయాలని ఇప్పటికే ఈఈకి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

గతంలోనూ ఇలాంటి ఘటనలు..

జలవనరుల శాఖలో గతంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగులు, ఇంజనీర్ల పై దాడి, దుర్భాషలాడిన ఘటనలు ఉన్నాయి. 2017-18 సంవత్సరంలో అప్పటి హంద్రీనీవా ఎస్ఈగా ఉన్న ఓ అధికారి దుర్భాషలు ఆడటం, గతేడాది హెచ్చెల్సీలోని ఓ ఉద్యోగిపై సూపరింటెండెంట్ స్థాయి అధికారి తీవ్రపదజాలంతో దూషించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇలా ప్రతి ఏటా జలవనరుల శాఖ పరిధిలో ఉద్యోగులు, ఇంజనీర్ల మధ్య వాగ్వాదాలు సాగుతూనే ఉన్నాయి.



జగనన్నకు చెబుదాంలో ఫిర్యాదు చేసిన ఇంజనీరు రామచంద్రమూర్తి

ఘటన వాస్తవమే

డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ రామచంద్రమూర్తిల మధ్య వాగ్వాదం జరిగిన మాట వాస్తవమే. ఇద్దరు ఇంజనీర్ల మధ్య వాదనలు జరుగుతున్న సమయంలో ఎదురుగానే ఉన్నా. ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఏఈకి అనారోగ్య సమస్యలు ఉన్నందున కొంత ఒత్తిడితో ఉన్నారు. వృత్తికి సంబంధించిన అంశంలోనే ఈ సమస్య తలెత్తింది. పోలీసులకు, ఉన్నతాధికారులకు జరిగిన ఘటనపై నివేదిక అందజేస్తున్నాం. ఇద్దరు మంచి ఇంజనీర్లు, బాగానే పనిచేస్తారు. అయితే కొద్దిగా ఇద్దరు సంమయనం కోల్పోయి ఆవేశం పడటంతోనే ఘటన జరిగింది. ఇద్దరికీ సర్దిచెప్పి పంపాం.

-శ్రీనివాసులు, ఈఈ, హెచ్చెల్సీ డివిజన్

బటన్ నొక్కారు సరే.. డబ్బులేవీ..?

మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, జనవరి 24: సీఎం జగన్ రెడ్డి బటన్ నొక్కడమే గాని, ఎన్నడూ డబ్బులు పడింది లేదని మాజీ మంత్రి పరిటాల సునీత ఎద్దేవా చేశారు. వెంకటాపురంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి ఎన్నిసార్లు జిల్లాకు వచ్చినా ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. తమ నియోజకవర్గంలోనే రైతుల పంటల బీమా బటన్ నొక్కి వెళ్లారని, కానీ చాలా మందికి డబ్బులు పడలేదని అన్నారు. తాజాగా ఆయన ఉరవకొండకు వచ్చి ఆసరా పేరుతో మహిళలకు టోకరా వేసి వెళ్లారని విమర్శించారు. డ్వాక్రా మహిళలకు సంపూర్ణ న్యాయం జరిగింది టీడీపీ హయాంలోనే అని అన్నారు. సీఎం ఎన్నికల సమయంలో వచ్చి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ఆయన వైఫల్యాలను ప్రజలు గుర్తుంచుకున్నారని అన్నారు. పోలవరం నుంచి రాప్తాడు నియోజకవర్గంలోని పేరూరు వరకూ ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని విమర్శించారు. చంద్రబాబు హయాంలో పేరూరు ప్రాజెక్టు కాలువకు రూ.804 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు కూడా ప్రారంభించామని అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక రివర్స్‌టెండర్ పేరుతో ప్రాజెక్టులను రివర్స్ చేశారని విమర్శించారు. జగన్‌కు చంద్రబాబు, పవన్ కల్యాణ్, మీడియాను తిట్టడం తప్ప వేరే పనిలేదని అన్నారు. ఇప్పుడు సొంత చెల్లెలు ఆయన చేతగాని తనం గురించి మాట్లాడుతున్నారని, ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. వర్షాలు కురిసి పేరూరు ప్రాజెక్టుకు నీరు వస్తే, తామే నీటిని తెచ్చామని ప్రకాశ్‌రెడ్డి గొప్పలు చెప్పుకున్నారని విమర్శించారు. ప్రాజెక్టు గేట్లు విరిగిపోతే మరమతు చేయించలేని దుస్థితిలో ఈ తోపు ఎమ్మెల్యే ఉన్నారని అన్నారు. దోపిడీలు, దౌర్జన్యాలు చేయడం, పరిటాల కుటుంబాన్ని విమర్శించడం తప్ప ఎమ్మెల్యే సోదరులు ఏమీ చేయరని విమర్శించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అక్రమంగా దండుకున్న భూములను వెనక్కి తీసుకుని పేదలకు పంచుతామని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల సునీత



అభిమాన నాయకుడికి గజమాలతో నివాళి



పరిటాల ఘాట్ వద్ద కిక్కిరిసిన అభిమానులు



ఘాట్ వద్దకు వారసులు..



పరిటాల రవీంద్రకు జన నివాళి



తండ్రి ఘాట్ వద్ద డాక్టర్ స్నేహలత నివాళి

మాజీ మంత్రి, దివంగత టీడీపీ నేత పరిటాల రవీంద్రకు వేలాది మంది అభిమానులు ఘన నివాళులు అర్పించారు. ఆయన స్వగ్రామం వెంకటాపురంలో బుధవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి జనం పోటెత్తారు. తెలంగాణ, కర్ణాటక సహా వివిధ రాష్ట్రాల నుంచి అభిమానులు విశేషంగా తరలివచ్చారు. పరిటాల రవీంద్ర సతీమణి, మాజీ మంత్రి పరిటాల సునీత, కుమారుడు, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, కూతురు స్నేహలత ఉదయమే ఘాట్ వద్దకు చేరుకుని నివాళులు అర్పించారు. ఘాట్ వద్ద కూర్చుని.. ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ రెండు జిల్లాల అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సీనియర్ నాయకులు పెనుకొండ సవితమ్మ, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులు పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.

- రామగిరి



తాతయ్యకు పుష్పాంజలి



ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల నివాళి

రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు

వెంకటాపురానికి వేలాదిగా వచ్చిన అభిమానులు

పరిటాల ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల ఉద్వేగం

నివాళులు అర్పించిన టీడీపీ జిల్లా అధ్యక్షులు, నాయకులు





అభిమానులకు అన్నదానం



నిను మరువం..

ప్రజల గుండెల్లో పరిటాల రవి

మాజీ మంత్రి పరిటాల సునీత

పరిటాల రవి చనిపోయి 19 ఏళ్ల గడిచిందంటే నమ్మశక్యంగా లేదని, సేవా కార్యక్రమాలతో ఆయన ప్రజల గుండెల్లో నిలిచిపోయారని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. భూమి ఉన్నంతవరకూ ఆయనను ప్రజలు మరిచిపోరని అన్నారు. ఎంతో మంది పుడతారు, చనిపోతారని, చరిత్ర కొంతమందిని మాత్రమే గుర్తు పెట్టుకుంటుందని అన్నారు. అలాంటి వారిలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర పేర్లు ముందుంటాయని అన్నారు. పరిటాల రవి ఆశయాలను పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ద్వారా కొనసాగిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ఆయన నిలబడ్డారని, అందుకే ఆయనను నేటికీ ప్రజలు మరచిపోలేదని అన్నారు. పరిటాల రవీంద్ర వర్ధంతిని పురస్కరించుకుని ఉమ్మడి రాష్ట్రంతోపాటు విదేశాలలోకూడా అభిమానులు సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. కొందరు ఆయన గురించి పిచ్చిగా మాట్లాడుతున్నారని, వారికి పరిటాల రవీంద్ర గురించి ఏమి తెలుసని ప్రశ్నించారు. అలాంటి మాటలతో ఆయన చరిష్మాను దెబ్బతీయలేరని అన్నారు.



పరిటాల రవి ఆత్మే మమ్మల్ని నడిపిస్తోంది

పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి



పరిటాల రవి స్ఫూర్తి, ఆయన ఆత్మే తమను ముందుకు నడిపిస్తోందని పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా, ప్రజల హృదయాల్లో ఉండిపోయారని అన్నారు. సమాజ హితం కోసం పరిటాల రవి బతికారు కాబట్టే ఇన్ని రోజులు ఆయనను ప్రజలు గుర్తుపెట్టుకున్నారని అన్నారు. అలాంటి వ్యక్తికి కొడుకుగా పుట్టినందుకు గర్వంగా ఉందని అన్నారు. ఆయనను తలచుకుని ఏ కార్యక్రమం మొదలుపెట్టినా విజయవంతం అవుతుందని అన్నారు. పరిటాల రవి వర్ధంతి సందర్భంగా ఏటా చాలాచోట్ల రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారని, వారు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు రవిపై ఉన్న అభిమానాన్ని చాటుతోందని అన్నారు. రక్తదానంపై ఆయన జిల్లా ప్రజల్లో అవగాహన ఎంతగానో పెంచారని అన్నారు. తన తండ్రి చనిపోయిన తరువాత.. తమ వెన్నంటే ఉండి నడిపిస్తున్నవారందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సూర్యప్రసాద్‌కు ప్రధానమంత్రి ప్రశంస

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకున్న రాగే సూర్యప్రసాద్‌ను పీఎం నరేంద్రమోదీ ప్రశంసించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి స్మృతి ఇరానీల చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాగే సూర్యప్రసాద్ బుధవారం ఢిల్లీలో ప్రధాని మోదీని కలిశారు. మోదీతో మాట్లాడిన అనంతరం గ్రూపు ఫొటో దిగారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు పొందడం గర్వకారణమని ఏపీఆర్ఎస్ గురుకుల ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.



ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పురస్కార గ్రహీత బాలలు

నియంత పాలనపై పోరాటం ఉధృతం చేయాలి

● బీవీ వెంకటరాముడుతో నారా లోకేశ్

అనంతపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నియంత పాలనపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారని ఆ పార్టీ రాయలసీమ జోన్-5 మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు తెలిపారు. బుధవారం హైదరాబాదులో నారా లోకేశ్‌ను ఆయన నివాసంలో బీవీ వెంకటరాముడు కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నారా లోకేశ్ పలు విషయాలపై చర్చించారని, యువగళం పాదయాత్ర స్ఫూర్తితో ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తూనే టీడీపీ హామీలపై విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారన్నారు. యువగళంలో రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా పాదయాత్ర విజయవంతం చేయడంలో కీలక భూమిక పోషించడంపై వెంకటరాముడును లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు.



లోకేశ్‌ను సత్కరిస్తున్న బీవీ వెంకటరాముడు

కదిరి వేరుశనగ రకాలు రాష్ట్రానికే తలమానికం: వీసీ



వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

కదిరి, జనవరి 24: కదిరి వేరుశనగ రకాలు రాష్ట్రానికే తలమానికమని అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన వీసీ మాట్లాడుతూ.. దేశంలోనే కదిరి వేరుశనగ రకాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కదిరి-6, కదిరి-లేపాక్షి రకాలు దేశవ్యాప్తంగా 70శాతం వరకు సాగవుతున్నాయన్నారు. వీటికి అధిక దిగుబడినిచ్చే లక్షణాలు ఉన్నాయన్నారు. ప్రధాన శాస్త్రవేత్త సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. పరిశోధనల కోసం వంద ఎకరాల భూమి అవసరమనీ, శాస్త్రవేత్తలు, సిబ్బంది కొరత ఉందని, మౌలిక వసతులు కల్పించాలని వీసీని కోరగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్లు వెంకటేశ్వర్లు, ప్రసన్న, రాజేష్, నీలిమ, వెంకటరమణ, వేమన, చంద్రనాయుడు పాల్గొన్నారు.



జడ్పీ కార్యాలయం



కారుణ్యం కరువయ్యింది..!

● జడ్పీలో ఊసేలేని కారుణ్య నియామకాలు ● రెండేళ్లుగా 140 మందికిపైగా ఎదురుచూపు

అనంతపురం విద్య, జనవరి 23 : కారుణ్యనియామకాల భర్తీపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తల్లిని కోల్పోయిన వారు కొందరు, తండ్రిని కోల్పోయిన వారు మరికొందరు. వారు భౌతికంగా లేకున్నా... కారుణ్య నియామకం కింద ఉద్యోగమైనా వస్తే తమ జీవితాలకు ఆసరాగా ఉంటుందని వందలాది మంది నిరుద్యోగులు రెండు, మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. మరికొందరు ఏఓ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. జడ్పీలో కొంత కాలంగా ప్రమోషన్లు, నియామకాలు ఆగిపోవడంతో... ఆశావహులకు దిక్కు తోచడంలేదు. దీనికితోడు త్వరలో ఎన్నికలు వస్తే.. మరింత జాప్యం తప్పేలా లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

140 మంది వరకూ....

జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్ పరిధిలోని జడ్పీ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయాలు, జడ్పీ స్కూళ్లలో కారుణ్య నియామకాలు గత కొంత కాలంగా ఆగిపోయాయి. అనారోగ్యం, ప్రమాదాలు, కరోనా, ఇతర కారణాలతో అనేక మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరణించారు. 2019, 2020, 2021 సంవత్సరాల నుంచి సుమారు 140 మంది వరకూ ఉద్యోగుల సంతానం కారుణ్య నియామకాలు ఎప్పుడు చేపడ్తారో అంటూ జడ్పీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఏడాది కిందట కారుణ్య నియామకాల కింద భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందంటూ.... అభ్యర్థుల్లో ఆశలు రేకెత్తించారు. అయితే ఇప్పటి వరకూ ఆ దిశగా అడుగులు పడలేదు.

ప్రమోషన్లూ అంతంతే...

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గుమ్మగట్ట, తాడిమర్రి, జడ్పీకార్యాలయం, వజ్రకరూరు, తదితర ప్రాంతాలతోపాటు, మరికొన్ని చోట్ల ఏఓ పోస్టులు ఖాళీలున్నాయి. ఈ క్రమంలో సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా ప్రమోషన్లు ఇస్తే.... జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే ప్రమోషన్ల ప్యానల్ కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఐదారు నెలలుగా పాలకవర్గం, అధికారుల మధ్య ఆధిపత్యపోరు కారణంగా నియామకాలు, ప్రమోషన్ల ఫైళ్లు పట్టాలెక్కలేదు. జడ్పీ సీఈఓగా ఐఏఎస్ అధికారి నియామకంతోనైనా నియామకాలు చేపడ్తారని అభ్యర్థులు ఆశిస్తున్నారు. ఎన్నికల లోపు భర్తీ చేపట్టాలని నిరుద్యోగులు, ప్రమోషన్ల ఆశావహ అధికారులు కోరుతున్నారు.

28న జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: జిల్లా స్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాల, బాలికల హాకీ ఎంపిక పోటీలు ఈనెల 28వతేదీన అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ అనంతపురం కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. 2005 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు జూనియర్ కేటగిరీకి, 2008 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు సబ్‌జూనియర్ కేటగిరీకి అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు ఆధార్, పదోతరగతి మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన జూనియర్ బాలికల హాకీ జట్టు ఫిబ్రవరి 9వతేదీ నుంచి 11వతేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే 14వ రాష్ట్ర జూనియర్ బాలికల హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు సబ్ జూనియర్ బాలుర జట్టు ఫిబ్రవరి 10వతేదీ నుంచి కర్నూలులో జరిగే 13వ రాష్ట్ర సబ్‌జూనియర్ బాలుర హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9490033474ను సంప్రదించాలని కోరారు.

వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 24 : వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. వీరారెడ్డి 19వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక గణేనాయక్‌భవన్‌లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వీరారెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, గుత్తి సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా వివిధ రంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి వీరారెడ్డి అని కొనియాడారు. అనేక పోరాటాల్లో రాటుదేలిన వీరారెడ్డి చనిపోయి 19 సంవత్సరాలైనప్పటికీ ఆయన స్ఫూర్తిని నెమరువేసుకుంటూ నేటి సీపీఎం నాయకత్వం జిల్లాలో పెద్దఎత్తున రైతు, కార్మిక పోరాటాలతో ఆందోళనలను కొనసాగిస్తోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకటనారాయణ, నాగమణి, సురేష్, వన్నూరప్ప, శివ, హరీష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వీరారెడ్డికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సమ్మె దిశగా డీఆర్‌డీఏ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: సమస్యల పరిష్కారం కోసం డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగులు ఇప్పటికే సమావేశం నిర్వహించి, సమ్మెపై చర్చించాల్సి ఉండేది. కానీ సీఎం పర్యటన నేపథ్యంలో వాయిదా వేసుకున్నారు. నగరంలోని రైతు బజారులో బుధవారం డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగుల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమ్మెలోకి వెళ్లాలని ఏపీడీ మొదలు డీపీఎంలు, ఏసీ, ఏపీఎంలు, సీసీల వరకు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో 600 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో సుమారు 90 శాతం మంది సమ్మెకు మొగ్గుచూపుతున్నారు.

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లాలో ఆర్‌డీఏ-వైకేపీ సమ్మెబాట పట్టారు. గురువారం నుంచి సమ్మెలోకి వెళ్లనున్నారు. బుధవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ఉద్యోగులు సమావేశమై, సమ్మెలోకి వెళ్తున్నట్లు తీర్మానించారు. అనంతరం సమ్మె నోటీసును డీఆర్‌డీఏ పీడీ నరసయ్యకు అందించారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు సమ్మె చేస్తామని ఆ ఉద్యోగుల జిల్లా జేఏసీ కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామమోహన్, నారాయణ, శంకర్, సుధాకర్, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

● సెబ్ అధికారుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 24: ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలని, మద్యం, నగదు, బంగారు నగలు అక్రమంగా తరలించకుండా నిఘా వేయాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ సెబ్ అధికారులను ఆదేశించారు. బదిలీల్లో భాగంగా సెబ్ విభాగంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐలు, ఎస్ఐలతో జిల్లా ఎస్పీ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి జిల్లాలోకి మద్యం తరలించకుండా అడ్డుకోవాలన్నారు. సారా ఊటలను ధ్వంసం చేయాలన్నారు. సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

'మీన్స్' వివరాలు నమోదు చేయండి: ఏసీ

అనంతపురం విద్య, జనవరి 24 : గత ఏడాది ఫిబ్రవరిలో జరిగిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో తమ వివరాలను ఈ నెల 31వ తేదీలోగా నమోదు చేయాలని ఏసీ గోవింద్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తర్వాత ఎలాంటి పొడిగింపు ఉండదని విద్యార్థులు ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, విద్యార్థి తండ్రి పేరు, మెరిట్ కార్డుపైన ముద్రించిన విధంగా ఆధార్‌పైన ఉన్న వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఒకవేళ ఆధార్ వివరాలు... మెరిట్ కార్డుతో సరిపోకపోతే ఆధార్ మిస్ మ్యాచ్ వివరాలను వెంటనే డీఈఓ కార్యాలయంలో సంప్రదించి ఈనెల 27వ తేదీలోగా అందజేయాలన్నారు. విద్యార్థి అందజేసిన చేసిన దరఖాస్తులను సంబంధిత స్కూల్ నోడల్ ఆఫీసర్ స్థాయిలో ఫిబ్రవరి 15వ తేదీలోగా క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారి ధ్రువీకరించాలన్నారు. 2019, 2021, 2022 సంవత్సరాల్లో ఎంపికైన ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లు, కళాశాలల్లోని విద్యార్థులు ఈ ఏడాది తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.28వేలు

అనంతపురం రూరల్, జనవరి 24: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.28వేలు, కనిష్ఠంగా రూ.14వేలు, సరాసరి రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 16 టన్నులు వచ్చాయన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో వివాదం

నార్పల, యల్లనూరు జట్ల కబడ్డీ పోటీల్లో పాయింట్ల చిచ్చు

అంపైర్ నార్పలకు అనుకూలమంటూ వాగ్వాదం

ఎస్ఐ సర్దిచెప్పినా వినని క్రీడాకారులు

మైదానంలో బైఠాయించి నిరసన


మైదానంలో నిరసన తెలుపుతున్న యల్లనూరు కబడ్డీ క్రీడాకారులు

శింగనమల, జనవరి 24: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో వివాదం నెలకొంది. శింగనమలలో బుధవారం నియోజకవర్గం ఆడుదాం ఆంధ్ర పోటీలు జరిగాయి. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కబడ్డీ పోటీల్లో భాగంగా నార్పల, యల్లనూరు జట్లు తలపడ్డాయి. యల్లనూరు జట్టుకు రావాల్సిన మూడు పాయింట్లకు బదులు అంపైర్ ఒక పాయింట్ ఇచ్చాడని క్రీడాకారులు వాగ్వాదానికి దిగారు. యల్లనూరు కెప్టెన్ గురు తమకు మూడు పాయింట్లు రావాల్సివుండగా ఒక పాయింట్ ఇవ్వడమేంటని అరగంటకుపైగా టీంతోపాటు బైఠాయించాడు. పీఈటీలు నచ్చజెప్పినా వారు వినలేదు. వివాదం ముదురుతుండగా ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి వచ్చి క్రీడాకారులు, అంపైర్లతో చర్చించారు. అంపైర్ల చెప్పింది వినాలని క్రీడాకారులకు ఎస్ఐ చెప్పడంతోవారు తాము పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు యల్లనూరు క్రీడాకారులు తేల్చిచెప్పారు. అక్కడి నుంచి వెళ్లిపోయారు. నార్పల, యల్లనూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగితే నార్పల మండలానికి చెందిన పీఈటీని ఏవిధంగా అంపైర్‌గా నియమిస్తారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అరకొరగా భోజనం... ఆకలితో అలమటించిన క్రీడాకారులు

నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నప్పుడు భోజన ఏర్పాట్లు ఆ మేరకు ఏర్పాటు చేయాలి. 300 మంది క్రీడాకారులు శింగనమలలో జరిగిన నియోజకవర్గస్థాయి ఆడుదాం.. ఆంధ్ర పోటీల్లో పాల్గొనగా నిర్వాహకులు మాత్రం కేవలం 150 మందికి మాత్రమే భోజన వసతి కల్పించారు. దీంతో చాలా జట్ల క్రీడాకారులు ఆకలితోనే పోటీల్లో పాల్గొన్నారు. భోజన వసతి కల్పించకుండా ఉంటే ఎలా అని యల్లనూరు మండల క్రీడాకారులు నిలదీయడం కనిపించింది. బుక్కరాయసముద్రం క్రీడాకారులకు భోజనం అందలేదు. దీంతో ఆయా టీంలకు చెందిన పీఈటీలే వారికి భోజన సదుపాయం కల్పించారు.

ప్రజల మనిషి పరిటాల రవీంద్ర

మాజీమంత్రి పరిటాల రవీంద్ర ప్రజల మనిషి అని టీడీపీ నాయకులు అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయాలలో పరిటాల చిత్రపటానికి పూల మాలలు వేసి, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. వెంకటాపురంలోని ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.


టీడీపీ జిల్లా కార్యాలయంలో పరిటాల రవీంద్రకు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, గద్దం సుబ్రహ్మణ్యం, సరిపూటి సూర్యనారాయణ, బాంబే డయింగ్ నాగన్న, వీరాంజినేయులు, గుడుపూటి నారాయణస్వామి నివాళులు అర్పించారు.


పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న కనగానపల్లి మండల నాయకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, యాతం పోతులయ్య, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, సుధాకర్ చౌదరి, బట్టా సురేష్‌చౌదరి, పూజారి రాజాకృష్ణ


రాప్తాడులో నివాళులు అర్పిస్తున్న కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి


రామగిరిలోని టీడీపీ కార్యాలయంలో పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు


ఆత్మకూరులోని వడ్డుపల్లి గ్రామంలో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు


సీకేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ శ్రేణుల నివాళి

'బకాయిలను వెంటనే చెల్లించాలి'

అనంతపురం విద్య, జనవరి 24: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ అరియర్ల కింద రూ. 6,246 కోట్లు, పీఆర్సీకి ముందు డీఏలు రూ. 1136 కోట్లు, పీఆర్సీ తర్వాత ప్రకటించిన డీఏల బకాయిలు రూ. 4,884కోట్లు పీఎఫ్ లోన్స్, పార్ట్ ఫైనల్ పేమెంట్స్ రూ. 1000 కోట్లు...ఇలా అన్ని రకాల పెండింగ్ బకాయిలు ఏకంగా 18 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈనెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో రిలే దీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రమణయ్య, రామప్ప, సరళ, సంజీవ్‌కుమార్, శేఖర్, సుబ్బరాయుడు, దేవేంద్రమ్మ, ఆదిశేషయ్య, శ్రీనివాసులు, నాగేంద్ర, మల్లికార్జున, శివానంద తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సెంట్రల్, జనవరి 24: ఎస్కేయూ క్యాంపస్‌లోని కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. వీరికి ఎస్కేయూ మాజీ ప్రొఫెసర్ ఏవీ రమణ, విద్యాలయం ప్రిన్సిపాల్ కరీమ్‌ఖాన్ ప్రశంసా పత్రాలందజేశారు.

రైతు సంక్షేమం ఏది జగన్: సీపీఐ


మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, జనవరి 24: సీఎం జగన్.... సంక్షేమం పేరుతో బటన్ నొక్కుతూ వెళ్తున్నారని, అయితే ఆయన సంక్షేమ కార్యక్రమాల్లో రైతులు ఉన్నట్టు కనిపించడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ విమర్శలు గుప్పించారు. సీపీఐ కార్యాలయంలో ఆయన ఇతర నాయకులతో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ జిల్లా పరిధిలోని రైతులకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. సీఎం టూర్‌కు వైసీపీ శ్రేణులను తరలించడానికి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ స్కూళ్ల బస్సులను తరలించేందుకు యాజమాన్యాలపై ఒత్తిళ్లు తేవడం, స్కూళ్లకు హాలిడే ప్రకటించడం సబబుకాదన్నారు. కేంద్ర కరువు బృందం జిల్లాల్లో పర్యటించిందని, అయితే కేంద్రానికి ఏం నివేదించారో నివేదికలు ఇంత వరకూ బహిర్గతం చేయలేదన్నారు. జగన్‌కు పోయేకాలం దాపురించిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, లింగమయ్య, మల్లికార్జున, నాగరాజు, చిన్నప్పయాదవ్, ఇతర నాయకులు రమణయ్య, కుళ్లాయిస్వామి, ఆనంద్, సంతోష్, మోహన్ పాల్గొన్నారు.

రేపు బైక్, ట్రాక్టర్లతో ర్యాలీ... మోదీ అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం కిసాన్ ట్రాక్టర్లు, బైక్స్‌తో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున, జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్ తెలిపారు.

మెడికల్ కళాశాలకు దేహదానం

అనంతపురం టౌన్, జనవరి 24: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఓ మృతదేహాన్ని వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం కుటుంబసభ్యులు దేహదానం చేశారు. తాడిపత్రి మున్సిపాలిటీ పోరాటాల కాలనీకి చెందిన వెంకటేష్(37) వంటమాస్టర్‌గా పనిచేసేవారు. అవివాహితుడు, తల్లిదండ్రులు లేకపోవడంతో పిన్నమ్మవద్ద జీవనం సాగించేవారు. అధిక బీపీతో ఇబ్బంది పడుతుండగా చికిత్సకోసం జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. నగరంలోని సాయిట్రస్టు వ్యవస్థాపకులు వెంకటేష్‌ను ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు చేయించారు. రక్తపోటు ఎక్కువ కావడంతో ఈనెల 16న ఆస్పత్రిలో కన్నుమూశారు. మృతదేహాన్ని మార్చురీలో పెట్టారు. బుధవారం మృతుడి పిన్నమ్మ అంగీకారంతో దేహాన్ని ఆస్పత్రికి అందజేశారు. మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ విభాగం వైద్యులు ఉమామహేష్ శంకర్ అంగీకారం తీసుకొని మృతదేహాన్ని కళాశాల విద్యార్థులకు అప్పగించారు.

విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతపురంరూరల్, జనవరి 24: విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక ఆవశ్యకత, ధరలు, వీలింగ్ ధరలు తదితరవాటిపై అభిప్రాయసేకరణ ఉంటుందన్నారు. ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ఉమ్మడి జిల్లాలోని అనంతపురం సర్కిల్ ఆఫీసులో అనంతపురం అర్బన్, రూరల్ డివిజన్ ప్రాంతాల వారికి, గుత్తి డివిజన్, కళ్యాణదుర్గం, హిందుపురం, కదిరి డివిజన్ కార్యాలయాల్లో ఈ మేరకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని వెబ్‌లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నామని పేర్కొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా చిన్నికృష్ణ

అనంతపురం అర్బన్, జనవరి 24: టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన చిన్నికృష్ణను నియమించారు. ఈ మేరకు బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి బాధ్యతల స్వీకరణ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 24: జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు తన చాంబర్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆ శాఖ ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పరిటాల రవీంద్రకు ఘన నివాళి

అనంతపురంరూరల్, జనవరి 24: మాజీమంత్రి పరిటాల రవీంద్రకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం ఘన నివాళులు అర్పించారు. మండలంలోని పాపంపేట సర్కిల్‌లో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ ఆధ్వర్యంలో పరిటాల రవీంద్ర చిత్రపటానికి పూలమాలలు వేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆకుతోపల్లిలోని అమ్మఒడి ఆశ్రమంలో టీఎన్ఎస్ఎఫ్ సత్యసాయి జిల్లా అధికార ప్రతినిధి రాప్తాడు గణేష్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీచేసి అన్నదానం చేశారు. ప్రవీణ్‌గౌడ్, నారాయణస్వామి, వంశీ, గుంజర గణేష్, వేణు, చంద్ర, సాయికుమార్ పాల్గొన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ రమణ, తెలుగురైతు అధ్యక్షుడు నారాయణస్వామి, చియ్యేడు లక్ష్మీనారాయణ, తిమ్మప్ప, పెద్దన్న, భాష, వెంకటరామడు, కురుబ సాధికర కమిటీ రాష్ట్ర డైరెక్టర్లు రాగేమురళి, నీళ్లపాళ్ల రాజగోపాల్, దూదేకుల ఫెడరేషన్ రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు అల్లీపీర, కురుగుంట వెంకటరాముడు, బుల్లే ఆది, పూలనాగరాజు, రవి, రాము, శంకర్‌నాయక్, యల్లప్ప, వెంకటస్వామి పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.


పాపంపేట సర్కిల్‌లో నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు


వెంకటాపురంలో పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తదితరులు


వెంకటాపురంలో పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న రాగే మురళి తదితరులు


అమ్మఒడి ఆశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న టీఎస్ఎస్ఎఫ్ నాయకులు రాప్తాడు గణేష్ తదితరులు

భక్తిశ్రద్ధలతో శివబాలయోగి మహరాజ్ జన్మతిథి

అనంతపురం కల్చరల్, జనవరి 24: శివబాలయోగి మహరాజ్ స్వామి జన్మతిథిని బుధవారం నగరశివారులోని శివబాలయోగి ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివబాలయోగిస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని పల్లకిలో ఏర్పాటుచేసి పల్లకీసేవ నిర్వహించారు. నగరానికి చెందిన గాధంశెట్టి విశ్వనాథం శెట్టి, ఉమాదేవి దంపతులు శివబాలయోగి మహరాజ్ స్వామికి వెండికిరీటాన్ని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, మల్లికార్జున ప్రసాద్, లక్ష్మినారాయణ, గోపి, మహేష్, భక్తులు పాల్గొన్నారు.

29న ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 24: న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం తాలూకా, తహసీల్దార్ కార్యాలయం ఎదుట, 29న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 5న విజయవాడలో రాష్ట్రస్థాయిలో పెద్దఎత్తున ధర్నా ఉంటుందని పేర్కొన్నారు.

జనసేన, టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత


మహిళలతో మాట్లాడుతున్న శ్రీలత

అనంతపురం రూరల్/ ప్రెస్‌క్లబ్, జనవరి 24: జనసేన, టీడీపీ పార్టీలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత అన్నారు. బుధవారం మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా రుద్రంపేట పంచాయతీలోని సైఫుల్లా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను నిలిపారన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలుచేశారన్నారు. ఆలోచించి జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వ స్థాపనకు దోహదపడాలన్నారు.

ముగిసిన అల్ట్రా మారథాన్


మారథాన్‌లో పాల్గొన్న క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 24: ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ ఆధ్వర్యంలో చేపట్టిన అల్ట్రా మారథాన్ బుధవారం బత్తలపల్లిలో ముగిసింది. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 9వ ఎడిషన్ అల్ట్రా మారథాన్‌లో స్పెయిన్, ఇటలీ, అర్జెంటీనా, ఈక్వెడార్ దేశాలకు చెందిన 67మంది విదేశీయులతోపాటు భారతీయులు 65 మంది మొత్తం 132మంది పాల్గొన్నారు. మొదటి రోజు అనంతపురం కలెక్టరేట్ నుంచి ఆర్డీటీ స్టేడియం, రెండో రోజు ఆర్డీటీ స్టేడియంలో కమ్యూనిటీ రన్, మూడో రోజు కుందుర్పిలో సాగగా నాలుగో రోజు బత్తలపల్లిలో ముగిసింది. చివరిరోజు ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నెఫెర్రర్, ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, అల్ట్రా రన్నర్ జువాన్ మాన్యువల్ వైరా, డైరెక్టర్లు, విదేశీయులు, యువత తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశాలు


ఎంపీటీసీ సంతకం చేస్తున్న భర్త

అనంతపురంరూరల్, జనవరి 24: మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. గంటలోపే ముగిసింది. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 12గంటలకు సమావేశం ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు ఎక్కువశాతం మంది హాజరుకాలేదు. వారిలోనూ చాలా మంది సర్పంచు, ఎంపీటీసీ ప్రజాప్రతినిధుల భర్తలుండటం గమనార్హం. కక్కలపల్లి కాలనీకి చెందిన వైసీపీ నాయకుడు శ్రీనివాసులు (స్థానిక ఎంపీటీసీ భర్త) సర్వే నెంబరు 109లోని ఇళ్లకు ఇంటి గుత్తలు వేయాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణను అడిగాడు. ఆ సర్వే నెంబరు పట్టణంలోకి వస్తుందని దీనికితోడు ఆ భూమి యజమాని కోర్టుకు వెళ్లారని సమాధానమిచ్చాడు. గతంలో కొంతమంది ఇచ్చారని అడగ్గా ఎమ్మెల్యేతోనో, ఎవరితోనైనా ఒత్తిడి చేయించివుంటారని తాను మాత్రం చేయనని ఖరాఖండిగా చెప్పారు. ఇంతలో ఎంపీడీఓ పుల్లయ్య కలుగజేసుకుని రెండురోజుల్లో చర్చించి చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పారు. ఇదే సందర్భంలో జడ్పీటీసీ చంద్రకుమార్ మాట్లాడుతూ సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారని ప్రశ్నించారు. పరిష్కరించేది లేదని కార్యదర్శి చెప్పడంతో ప్రజాప్రతినిధులతో ఇలానేనా మాట్లాడేదంటూ జడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మీ మాట వింటారని మమ్మల్ని కూడా లెక్కలేకుండా మాట్లాడుతారా అంటూ మండిపడ్డారు. ఈక్రమంలోనే సదరు కార్యదర్శికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓకు సూచించారు.

'రెగ్యులర్ ఏఈని నియమించాలి'

గార్లదిన్నె: విద్యుత్‌శాఖలో రెగ్యులర్ ఏఈని నియమించాలని ప్రజాప్రతినిధులు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఇన్‌చార్జి ఏఈ ఉన్నారని, ఆయన ఎప్పుడు ఉంటారో..? ఉండరో... తెలియటం లేదని టీడీపీ, వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచులు పేర్కొన్నారు. మర్తాడు క్రాస్ నుంచి కోటంక వరకు రహదారి గుంతలమయంగా ఉన్నా పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటనారాయణ, తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు రామచంద్ర, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆలస్యంగా ప్రారంభం

చెన్నేకొత్తపల్లి: మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ అంజలి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఉదయం 10-30గంటలకు సమావేశమని అజెండాలో పేర్కొన్నప్పటికీ 12గంటలకు ప్రారంభించారు. శాఖల వారిగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కాగా మహిళా ప్రజాప్రతినిధులకు సంబంధించి భార్యల స్థానంలో భర్తలు, ఇతర కుటుంబసభ్యులు సమావేశానికి హాజరుకావడం పట్ల పలువురు విస్మయం వ్యక్తంచేశారు. సమావేశంలో జడ్పీటీసీ గోవిందరెడ్డి, ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నం

అనంతపురం విద్య, జనవరి 24: అనంతపురం నగరంలోని అంబేడ్కర్ నగర్ అంగన్వాడీ కేంద్రం కార్యకర్త లలిత బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. విష రసాయనాన్ని తాగిన ఆమెను జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించారు. కుటుంబ సమస్యల కారణంగా ఆమె ఆత్మహత్యకు యత్నించారని కొందరు అంటున్నారు. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించి, మరొకరికి కట్టబెట్టేందుకు అనంతపురం సీడీపీఓ ప్రాజెక్టు ఆఫీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారని, అందుకే ఆమె ఆత్మహత్యకు యత్నించిందని మరికొందరు చెబుతున్నారు. అనంతపురం నగరంలోని సీఐటీయూ కార్యాలయానికి వెళ్లిన ఆమె.. అక్కడే ఆత్మహత్యకు యత్నించారు. కార్యాలయంలో పడిపోయిన ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఆమెకు ఇద్దరు పిల్లలున్నాయని, ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారని తోటి వర్కర్లు చెబుతున్నారు.

ధర్మవరంలో రోడ్లు వేయిస్తారా..? మేం వేయాలా..?

● మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల


పరామర్శిస్తున్న గోనుగుంట్ల

అనంతపురం సెంట్రల్, జనవరి 24: ధర్మవరంలో రోడ్లు వేయిస్తారా..? మేం వేయాలా..? అని గోనుగుంట్ల సూర్యనారాయణ ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీశారు. బుధవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయానికి వెళ్లి ఎస్‌ఈని కలిసి ధర్మవరంలో రోడ్లను బాగుచేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలోని రోడ్లు గుంతలమయం కావడంతో అక్కడి ప్రజలు నరకయాతన పడుతున్నారన్నారు. ఐదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటారామిరెడ్డి తట్టెడు మట్టివేయించిన పాపాన పోలేదని. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందించడంలేదన్నారు. ఆ రోడ్లను మరమ్మతు చేయించకుంటే తానే స్వంతఖర్చుతో చేస్తానని అన్నారు. ఎస్‌ఈని కలిసి వారం రోజులలోపు పనులు మొదలు పెట్టాలని చెప్పడం జరిగిందన్నారు. ధర్మవరం చెరువులో 100ఎకరాలు కొల్లగొట్టేందుకు యత్నిస్తే అడ్డుకున్నామన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)కి ఫిర్యాదు చేశామన్నారు. విచారణ జరుగుతోందని, ఎవరైనా అధికారులు తప్పుడు నివేదికలు సమర్పిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తాను న్యాయపోరాటంచేసి తిరిగి పనులు ప్రారంభించానని తెలిపారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలుపొందుతానని ధీమా వ్యక్తంచేశారు. అంతకుమునుపు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న రామచంద్రనాయక్‌కు గోనుగుంట్ల సూర్యనారాయణ బుధవారం ఆర్థికసాయం చేశారు. బాధితుడిని పరామర్శించి రూ.20 వేలు ఇచ్చారు.

విద్యుత్ చౌర్యాన్ని అరికట్టండి

అనంతపురంరూరల్/రాప్తాడు, జనవరి 24: విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని తిరుపతికి చెందిన విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్ఈ శ్రీనివాసబాబు పేర్కొన్నారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన జిల్లా డీపీఈ విభాగం ఈఈ గోపీతో కలసి సంబంధిత అధికారులతో జెఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలోని అతిథిగృహంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ వృథాకాకుండా చొరవ చూపాలన్నారు. విద్యుత్ అక్రమవాడకం, లోడ్‌కుమించి వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం హెచ్‌టీ సర్వీసులు విడుదల చేశారు. అనంతం అక్కడి నుంచి రాప్తాడు మండల కేంద్రంలోని ఫీడర్‌లో ఎక్కువ లైన్ లాసేస్ ఉండటాన్ని గమనించి విద్యుత్ సర్వీసును తనిఖీ చేశారు. 7.5 హెచ్‌పీ బోర్ మోటర్ డైరెక్ట్‌గా వాడుతుండటాన్ని గమనించారు. అలాగే ఓ ఇంటిలో మీటర్ నుంచి కాకుండా డైరెక్ట్‌గా విద్యుత్ వాడడాన్ని గమనించి సదరు వినియోగదారులకు రూ.5లక్షల జరిమాన విధించారు. కార్యక్రమంలో డీఈఈ నాగేంద్ర, ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.55 వేల విరాళం

అనంతపురం సెంట్రల్, జనవరి 24: కురుగుంటలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి బీజేపీ అసెంబ్లీకన్వీనర్ చైతన్య కిషోర్ రూ.55 వేలు విరాళం అందజేశారు. ఆలయ నిర్వాహకులకు ఆయన ఈ మొత్తాన్ని బుధవారం అందజేశారు.

జీవితాలను నాశనం చేశాడు

మాజీ వీసీ రామకృష్ణారెడ్డిపై ఎస్కేయూ ఉద్యోగుల ఆగ్రహం

అనంతపురం సెంట్రల్, జనవరి 24: తన మూర్ఖత్వపు దోరణితో మాజీ వీసీ రామకృష్ణారెడ్డి అనేకమంది ఉద్యోగులను, సిబ్బంది జీవితాలను నాశనం చేశాడని ఎస్కేయూ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం రిజిస్ట్రార్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో నాన్‌టీచింగ్ ఉద్యోగులతో వీసీ హుస్సేన్‌రెడ్డి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మూడు సంవత్సరాల్లో వారు ఎదుర్కొన్న సంఘటనలను వివరించారు. స్పందించిన వీసీ మీ మధ్యలో పని చేశాను.. సమస్యలపై అవగాహన ఉంది.. న్యాయం చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో పలువురు డీఆర్‌లు, ఏఆర్‌లు, సూపరింటెండెంట్‌లు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీల ద్రోహి సీఎం జగన్

మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

పామిడి, జనవరి 24: రాష్ట్రంలోని బీసీలను అన్ని విధాలుగా మోసం చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీల ద్రోహిగా నిలిచారని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం జయహో బీసీ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్త శుద్ధితో కృషి చేసిన పార్టీ తెలుగుదేశం మాత్రమేనన్నారు. బీసీలకు చట్ట సభల్లో సైతం అత్యధిక ప్రాధాన్యం కల్పించిన పార్టీ తెలుగుదేశం అన్నారు. సీఎం జగన్ తన మాయమాటలతో బీసీలను మోసం చేసి అధికారం చేపట్టారన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, వాటికి నిధులు కేటాయించకపోవడం, కనీసం ఆ కార్పొరేషన్ల చైర్మన్లకు, డైరెక్టర్లకు కూర్చోటానికి కుర్చీలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఇటువంటి ఫెయిల్యూర్ సీఎంని గద్దె దించాల్సిన బాధ్యత బీసీలపై ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు, గంజే నాగరాజు, వైయూ రామాంజనేయులు, ఆవుల కిష్టయ్య, అప్పన్నగారి కుమార్, గాండ్ల విశాలాక్షి, ప్రతాప్, గాదిలింగ, గుమ్మనూర్ వెంకటేష్, గౌస్‌పీరా, వడ్డే ఆనంద్, వెంకటరమణ, సుంకప్ప, తలారి మస్తానప్ప, జింకల సంజీవకుమార్, రాముడు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉన్నం హనుమంతరాయ చౌదరి



పరిటాల రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు (గుంతకల్లు టౌన్)



కళ్యాణదుర్గం ఎన్టీఆర్ భవన్‌లో పరిటాల రవీంద్ర చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

పరిటాల రవీంద్రకి ఘన నివాళి

గుంతకల్లు టౌన్/గుత్తి/ కళ్యాణదుర్గం, జనవరి24: దివంగత మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతిని బుధవారం వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. గుత్తి ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, కళ్యాణదుర్గంలోని ఎన్టీఆర్ భవన్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి క్యాంపు కార్యాలయం, గుంతకల్లులో టీడీపీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిటాల రవి చేసిన సేవల గురించి కొనియాడారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల రవి అభిమానులు పాల్గొన్నారు.



గుత్తిలో పరిటాల రవి వర్ధంతి నిర్వహిస్తున్న వెంకటశివుడుయాదవ్

కొనసాగుతున్న జేసీపీఆర్ బస్సుయాత్ర



వృద్ధురాలితో మాట్లాడుతున్న జేసీపీఆర్

పెద్దవడుగూరు, జనవరి24: మండలంలో తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి చేపట్టిన బస్సుయాత్ర బుధవారం కొండపల్లి, కిష్టిపాడు, కదరగుట్టపల్లి గ్రామాల్లో కొనసాగింది. ప్రతి గ్రామంలో జేసీకి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో చిన్నారులను, మహిళలను, వృద్ధులను జేసీ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం గ్రామంలోని సమస్యలపై ఆరాతీశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని, ప్రజల సమస్యలు తీరుతాయని తెలిపారు. టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు జేసీ వివరించారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, భోగేశ్వరనాయుడు, హాజీవలి, నాగరాజు, దాదావలి, చిరంజీవులు, కార్యకర్తలు ఉన్నారు.

పత్తి రైతుకు పరామర్శ: మండలంలోని మల్లేనిపల్లి గ్రామానికి చెందిన రైతు రంగయ్యకు చెందిన పత్తి దిగుబడికి రెండురోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బాధిత రైతు రంగయ్యను పరామర్శించారు. సంఘటనపై ఆరాతీశారు.

పార్కింగ్ స్థలం పట్ల వామపక్షాల అభ్యంతరం



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గుంతకల్లు టౌన్,జనవరి24: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉండే స్థలాన్ని పార్కింగ్ ప్లేస్‌గా ఏర్పాటు చేయడానికి కౌన్సిల్‌లో తీర్మానం చేయడం అన్యాయం అని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ 50 సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపడుతూ ఆ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నా మన్నారు. ఈ స్థలంలో అన్ని రాజకీయ పార్టీలు నిరాహార దీక్షలు, నిరవధిక దీక్షలు, సమ్మెలు, సభలను నిర్వహిస్తున్నారు. అటువంటి స్థలాన్ని పార్కింగ్ ప్లేస్‌కు కేటాయించి ప్రజా సమస్యలను బయటికి రాకుండా చేయడానికి మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ చైర్‌పర్సన్ భవానికు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీ శ్రీనివాసులు, దాసరిశ్రీనివాసులు, మారుతీప్రసాద్, కసాపురం రమేష్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఎం ఎంఎల్‌న్యూడెమోక్రసీ నాయకులు చిన్నా, రామాంజినేయులు, దేవేంద్ర, బాషా పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

రాయదుర్గం, జనవరి 24: పట్టణంలోని బళ్లారిరోడ్డు గంగమ్మబావి వద్ద బుధవారం రాత్రి ఆటో ఢీకొని జయకుమార్(45) మృతి చెందాడు. నేసేపేటలో టైలరింగ్ చేసే జయకుమార్ బళ్లారిరోడ్డులో నడుచుకుంటూ వెళుతున్నాడు. వెనుక నుంచి వచ్చిన ఆటో అదుపుతప్పి అతన్ని ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైస్‌మిల్లు యజమానిపై దాడి

తాడిపత్రిటౌన్, జనవరి24: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డులో ఉన్న రైస్‌మిల్లు యజమాని హనుమంతయ్యపై బుధవారం నాగరాజు, పవన్‌లతోపాటు మరికొంతమంది దాడిచేశారని పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు మంగళవారం నాగరాజు, పవన్‌లు రైస్‌మిల్లు వద్దకు వెళ్లి 25కేజీల బియ్యం ప్యాకెట్‌ను తీసుకున్నారు. ఇంటికి వెళ్లి పరిశీలించిన అనంతరం బియ్యం బాగాలేవని బుధవారం హనుమంతయ్య దృష్టికి తీసుకువచ్చారు. బియ్యం వెనక్కి తీసుకొన్న హనుమంతయ్య డబ్బులు వెనక్కి ఇచ్చాడు. అప్పుడు వెనుదిరిగిన పవన్, నాగరాజులు మరో కొంతమందితో కలిసి తిరిగి వచ్చి హనుమంతయ్యపై రాళ్లు, కట్టెలతో దాడిచేశారు. గాయపడ్డ హనుమంతయ్యను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు

రాయదుర్గం, జనవరి 24: పట్టణం లోని రెండు దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. రూ. 23 వేలు అపరాధ రుసుము వసూలు చేశారు. ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన మేరకు పట్టణంలోని పాత ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోమొబైల్ దుకాణంలో విడిభాగాలకు ఎమ్మార్పీ ధరలు లేకపోవడంతో రూ. మూడువేలు, తేరుబజారులోని గౌరీ శంకర్ ఆగ్రో ఏజెన్సీ దుకాణంలో స్ప్రే యర్లకు ఎమ్మార్పీల ధరలు లేకపోవడంతో రూ. 20 వేలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు.

తెలుగుదేశం పార్టీలోకి పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

బెళుగుప్ప, జనవరి 24: మండలంలో వైసీపీకి పట్టున్న రామసాగరం గ్రామంలో పలువురు నాయకులు బుధవారం టీడీపీలో చేరారు. అనంతపురంలో టీడీపీ సీనియర్ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో పార్టీలో చేరారు. వెన్నపూసల గోవర్ధన్ రెడ్డి, హనుమంతరెడ్డి, సంజీవ రెడ్డి, రాములు, అనిల్‌రెడ్డి, కుమ్మతి హనుమంతరెడ్డి, గొల్ల సురేష్, వడ్డే నారాయణ స్వామి, దివాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి పార్టీలోకి చేరారు.

గుంతకల్లు: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన పది కుటుంబాలు బుధవారం ఉదయం టీడీపీలో చేరాయి. వెంకట శివుడు యాదవ్ తన వ్యక్తిగత కార్యాలయంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో పట్టణానికి చెందిన హనుమేశ్, అంజి, జిలాన్, ఖాజా, హుసేన్, సీన, సురేఖ, హుసేని, తదితర పది కుటుంబాలవారు ఉన్నారు.

షర్మిల దృష్టికి జిల్లా సమస్యలు: శైలజానాథ్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

గుంతకల్లుటౌన్/ ఉరవకొండ, జనవరి 24: జిల్లాలో నెలకొన్న అనేక సమస్యలను ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల దృష్టికి తీసుకెళ్తామని మాజీ మంత్రి శైలజానాథ్ తెలిపారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఉరవకొండలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను, రఘువీరారెడ్డి మంత్రులుగా ఉన్నపుడు కృష్ణాజలాలను జిల్లాకు తీసుకువచ్చి సస్యశ్యామలం చేశామని ఆయన గుర్తు చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలోని అన్ని చెరువులకు నీరు ఇవ్వాలన్నారు. దేశానికి, రాష్ట్రానికి నమ్మకం, భవిష్యత్తు ఇవ్వగలిగింది కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. గుంతకల్లులో నెలకొన్న సమస్యలను ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచాలని షర్మిలను కోరుతామన్నారు. ఈనెల 28 అనంతపురంలో జరిగే సభకు షర్మిల హాజరవుతారని ఈ సభను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు దౌల్తాపురం ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు మాహబుబ్ బాషా, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ యాదవ్, రామానాయుడు, మైనార్టీ నాయకులు దాదాగాంధీ, శీనా, అబ్బాస్, సుధాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కూడేరులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

యాడికి, జనవరి24: మండలంలోని రాయలచెరువులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత కంటి వైద్యశిబిరానికి 160మంది హాజరవగా 50మందిని ఆపరేషన్ల కోసం ఎంపికచేశారు. ఆపరేషన్ల నిమిత్తం వారిని బెంగళూరు శంకర కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి హోటల్ నాగేంద్ర భోజన వసతి కల్పించారు. వైద్యశిబిరంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి, సభ్యులు రవిప్రసాద్, రంజిత్‌కుమార్, కులశేఖర్‌నాయుడు, ఇస్మాయిల్, సూర్యనారాయణ, ప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: స్థానిక వివేకానంద స్కూల్‌లో టీడీపీ నాయీ బ్రాహ్మణ సాధికార సమితి నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు బుధవారం నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 200మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులతో పాటు కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా చికిత్స చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆనంద్, రాజు, నాగరాజు, రమణ, రామాంజనేయులు, ప్రసాద్, నాగేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పయ్యావుల కేశవ్‌ను విమర్శించే అర్హత విశ్వకి లేదు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 24: నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడుతున్న తమ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను విమర్శించే అర్హత వైసీపీ నాయకుడు విశ్వేశ్వరరెడ్డికి లేదని టీడీపీ నాయకులు విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉరవకొండకు వచ్చి తన పాలనలో ఏమి అభివృద్ధి సాధించారో చెప్పకుండా బటన్ నొక్కి, నిరాశ పరిచారన్నారు. దళితులతో పాటు అన్ని వర్గాలను మోసపుచ్చి మభ్యపెట్టేందుకు విగ్రహ ఆవిష్కరణలు చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో పయ్యావుల ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఒక్క హామీని నెరవేర్చలేని విశ్వకి ఓటు అడిగే హక్కు లేదన్నారు. మండలంలో ఉన్న చెరువులను హంద్రీనీవా నీటితో నింపకుండా రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. టికెట్ దక్కదన్న భయంతో విశ్వ అష్టకష్టాలు పడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రాధాకృష్ణ, పెద్దతిప్పయ్య, తిమ్మప్ప, మల్లికార్జున, విరుపాపల్లి రాధాకృష్ణ, కాలువపల్లి దిలీప్, ఆవులెన్న సర్పంచ్ రాము, శీర్పి వెంకటేశులు, సునిల్, తిప్పేస్వామి, దేవప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, జనవరి24: పట్టణంలోని జయనగర్ కాలనీకి చెందిన కిరణ్‌కుమార్ (23) బుధవారం చల్లవారిపల్లి గ్రామ సమీపంలో రైలుకిందపడి ఆత్మహత్య చేసుకు న్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు జయనగర్‌కాలనీకి చెందిన ఆంజనేయులు, గౌరమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా వీరిలో కిరణ్‌కుమార్ చిన్నవాడు. కిరణ్‌కుమార్ కార్పెంటర్‌గా పనిచేసేవాడు. ఏడాది కిందట తల్లి మృతి చెందడంతో తీవ్ర మనస్తాపం చెంది అనారోగ్యం పాలయ్యాడు. దీంతో జీవి తంపై విరక్తిచెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కిరణ్‌కుమార్ అవివాహితుడు. తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీ హీరేహాళ్‌లో...

డీ.హీరేహాళ్: మండల కేంద్రానికి చెందిన వీరేశప్ప కుమారుడు హెచ్‌కే ప్రదీప్(34) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు ప్రదీప్ మండల కేంద్రంలోనే తమ కుటుంబం నిర్వహించే హోటల్‌లో పని చేసేవాడు. గత కొన్ని రోజులుగా తాగుడుకు బానిస అయ్యాడు. తాగిన మత్తులో మంగళ వారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. బుధవారం ఉదయం ఎంతసేపటికి గది తలుపులు తీయకపోవడంతో కుటుంబసభ్యులు తలుపులు పగులగొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఉరి తప్పించి పరిశీలించగా చనిపోయినట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. ఎస్ఐ రంగడుయాదవ్ తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో డ్రైవర్...

ఉరవకొండ: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నివాసముంటున్న ఆటో డ్రైవర్ చంద్రశేఖర్(48) ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. మద్యానికి బానివడం, కుటుంబసమస్యలతో మంగళవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వ్యవసాయ అధికారుల సమీక్ష

గుత్తి, జనవరి 24: గుత్తి వ్యవసాయ డివిజన్ పరిధిలోని గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, యాడికి, శింగనమల మండల వ్యవసాయ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటరమణ మాట్లాడుతూ పత్తి, జొన్న, కంది పంటలను సాగు చేసిన ప్రతి రైతు ఆర్బీకేలో తమ పేర్లను సీఎంఏపీడీ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం కంది పంట క్వింటా రూ.9370లు, జొన్న క్వింటా రూ. 3225లు, హైబ్రిడ్ జొన్న క్వింటా రూ.3150 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. పత్తి పంటకు సంబంధించి పేర్లను నమోదు చేసుకున్న రైతులు శాంపిల్ తీసుకుని గుత్తి మార్కెట్ యార్డ్‌లో సీసీఐ అధికారులకు ఇవ్వాలన్నారు. పత్తి క్వింటా రూ.7020తో కొనుగోలు చేస్తారన్నారు. పీఎం కిసాన్‌లో ఎన్‌పీసీఐ, ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో టీడీపీ కౌన్సిలర్ల పర్యటన

తాడిపత్రి, జనవరి24: పట్టణంలోని ఇందిరానగర్‌లో బుధవారం టీడీపీ కౌన్సిలర్లు పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ కౌన్సిలర్లు విజయ్‌కుమార్, జింకా లక్ష్మీదేవి, రేష్మాపర్వీన్, జ్యోతి, బింగి ప్రభాకర్ తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించి, పథకాల గురించి అందించారు. ప్రజలందరూ తెలుగుదేశం పార్టీకి ఓటువేయాలని వారు కోరారు.

బాలికలు ఆశయ సాధన కోసం కృషి చేయాలి: ఆర్డీఓ



యాడికి: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 24: బాలికలు గొప్ప ఆశయ సాధనం కోసం కృషి చేయాలని ఆర్డీవో రాణి సుష్మిత పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఏదైనా ఒక రంగాన్ని ఎంచుకొని అందులో నైపుణ్యం సాధించే విధంగా కృషి చేసుకుంటూ ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గర్వపడేలా బాలికలు జీవితంలో స్థిరపడాలని తెలియజేశారు. పోక్సో, దిశ యాక్ట్ మీద అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో సాలమాన్, సూపర్‌వైజర్ భారతి, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బీపీసీ జ్ఞానేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ: బాలికలు అన్ని రంగాలలో రాణించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి తండాలో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు తులసీదాస్ నాయక్, బంజారాసంఘం నాయకులు సుబ్రహ్మణ్యం నాయక్ మాట్లాడుతూ సావిత్రిబాయిఫూలే, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వీరవనితల స్ఫూర్తితో బాలికలు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షాలిన్, ఉపాధ్యాయులు నాగరాజు, వరప్రసాద్, దౌలత్‌ఖాన్ పాల్గొన్నారు.

యాడికి: ఆడపిల్లలను రక్షించాలి... బాగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం యాడికిలో ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడపిల్లల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎదిరించి, వారిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు. ప్రతి బాలిక విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ వర్కర్లు మహాలక్ష్మి, గీత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూముల విలువ పెంచుకోడానికే!

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామంలో నిర్మిస్తున్న ఆర్డీవో కార్యాలయానికి సంబంధించి పూర్తి వివరాలను తమ ముందు ఉంచాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, అనంతపురం జిల్లా కలెక్టర్, తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వ్యాపారి టి.నాగార్జునరెడ్డి తదితరులకు నోటీసులు జారీ చేసింది. విచారణను ఫిబ్రవరి 21వ తేదీకి వాయిదా వేసింది. కార్యాలయ నిర్మాణాన్ని నిలువరిస్తూ ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల భూముల విలువను పెంచుకొనేందుకు, రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని వృద్ధి చేసుకొనేందుకు వీలుగా చిన్నపొలమడ గ్రామంలోని అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులూ లేకుండా ఆర్డీవో కార్యాలయ నిర్మాణం చేపడుతున్నారంటూ తాడిపత్రి లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి నదీముద్దీన్, వి.రవిమోహన్ వేర్వేరుగా రెండు పిల్‌లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు తాండవ యోగేష్, గంటా శ్రీదేవి వాదనలు వినిపించారు. తాడిపత్రి పట్టణంలో ఇప్పటికే ఆర్డీవో కార్యాలయం ఉందని, తాడిపత్రి ఎమ్మెల్యే రాసిన లేఖ ఆధారంగా కొత్తగా మరో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటుకు కలెక్టర్ చర్యలు ప్రారంభించారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే, ఆయన బంధువులు ప్రణాళిక ప్రకారం ముందుగా అక్కడ భూములు కొనుగోలు చేశారని, ఆ భూముల విలువ పెరిగేందుకు వీలుగా భూముల సమీపంలో ఆర్డీవో కార్యాలయం, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యాలయం ఏర్పాటుకు అసైన్డ్ భూములను తీసుకొంటున్నారని, ప్రైవేటు రియల్టర్‌కు చెందిన భూమిని సైతం దీనికి వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. అసైన్డ్‌దారుల నుంచి చట్టప్రకారం భూములను స్వాధీనం చేసుకోలేదని, ఆర్డీవో కార్యాలయం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదన్నారు. భవన నిర్మాణాలను నిలువరించాలని అభ్యర్థించారు.

విద్యుత్ కోసం రైతుల నిరసన



కళ్యాణదుర్గంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టిన రైతులు

కళ్యాణదుర్గం, జనవరి 24: విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలంటూ కంబదూరు మండలం పీ వెంకటంపల్లి గ్రామ రైతులు విద్యుత్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. పాళ్లూరు గ్రామ పరిధిలోని రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా ఇవ్వలేదంటూ కళ్యాణదుర్గం విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. అక్కడి అధికారులు మాకు సంబంధం లేదని పై అధికారుల వద్దకు వెళ్లి మాట్లాడుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో కాసేపు రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. పాళ్లూరు, వెంకటంపల్లి రైతులు కార్యాలయం ముందు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ శాఖ డీఈ, రైతుల పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నాడని మండిపడ్డారు.

జడ్ వీరారెడ్డి వర్ధంతి

గుత్తి,జనవరి24: పట్టణ శివారులోని జడ్‌వీరా రెడ్డి కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో జెడ్‌వీరారెడ్డి 19వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో జెడ్ వీరారెడ్డి 19వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలో సీపీఐ సీనియర్ నాయకుడు జడ్ వీరారెడ్డి వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన సమాధి వద్ద నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కర్నూలుకు తరలి వెళ్లిన తెలుగుతమ్ముళ్లు

బొమ్మనహాళ్, జనవరి 24: కర్నూలులో జరిగిన ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమానికి తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, ఐటీడీపీ అధ్యక్షులు కుమార్, ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్ తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ, కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు బీటీ నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని విస్తృతంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకోవాలని చెప్పారని కొండాపురం కేశవరెడ్డి తెలిపారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కేశవ్

ఉరవకొండ, జనవరి 24: మండలంలోని వ్యాసాపురం గ్రామంలోని మారెమ్మదేవి, దేవమ్మ దేవి జాతరలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. టీడీపీ నాయకులు బుధవారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. సర్పంచ్ సీతారాములు పాల్గొన్నారు.

టీడీపీలో నియామకం



చిన్ని క్రిష్టయ్య

రాయదుర్గం, జనవరి 24: తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా చిన్ని క్రిష్టయ్యను పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు నియమించారు. గుమ్మఘట్ట మండలంలో పార్టీ సీనియర్ నాయకుడిగా ఉంటూ చురుకుగా వ్యవహరించే చిన్ని క్రిష్టయ్య నియామకం పట్ల పార్టీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధిగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

ట్యాబ్‌ల పంపిణీ

పుట్లూరు, జనవరి 24: మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 62మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రేమ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.